క్లుప్తంగా

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, ఉచిత అన్నదానం జరిగాయి.

పితృ దేవతలకు తర్పణాలు



నల్ల కాలువ రేవులో పితృ కార్యాలు నిర్వహిస్తున్న పురోహితులు

అనపర్తి: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని అనపర్తిలో పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. ఆదివారం నల్ల కాలువ రేవు, శివలింగం ఘాట్ వద్ద, బట్టు వారి రావి చెట్టు వద్ద అధిక సంఖ్యలో మహాలయ పక్షాలు సమర్పించుకున్నారు. వంశంలో గతించిన వారి పేరున గ్రామంలోని పురోహితులు భక్తి శ్రద్ధలతో పితృ కార్యక్రమాలు నిర్వహించారు.

పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు



చంద్రేడులో పాడిగేదెకు టీకా వేస్తున్న సిబ్బంది

రంగంపేట: గాలికుంటు వ్యాధి సోకకుండా పశువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్లు శేషరావు, మురళీ అన్నారు. మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఏడాదికి రెండు సార్లు ఉచితంగా టీకాలు అందిస్తున్నట్టు తెలిపారు. పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని సూచించారు. పశువులకు ఈ వ్యాధి వైరస్ వల్ల సంక్రమిస్తుందని చెప్పారు. వ్యాధి వల్ల తలెత్తే దుష్పరిణామాలను వివరించారు.

పండగ సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలి

బిక్కవోలు: పౌరుల రక్షణే తమ బాధ్యత అని ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ అన్నారు. దసరా సెలవులలో వేరే ఊళ్లకు వెళ్లేవారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. దీంతో రాత్రివేళ గస్తీలో వారి ఇంటిపై నిఘా ఉంచుతారన్నారు. ఇళ్లల్లో చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లేవారు దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. డబ్బు, బంగారం దొంగల బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నగదు, నగలను బ్యాంకు లాకర్లలో జాగ్రత్త చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానంగా సంచరించే వారు, అపరిచితులు కనబడితే పోలీసు స్టేషన్ లేదా డయల్ 112కు సమాచారం అందించాన్నారు. పండగ సందర్భంగా ఆఫర్ల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఫోన్లకు వచ్చే అనుమానిత మెసేజ్‌లు, లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైన వారు 1930కి కాల్ చేయాలని తెలిపారు.

బీసీ గురుకులంలో పే ఫోన్లు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో పేఫోన్ పేరిట టెలిఫోన్ బాక్సులను ఏర్పాటు చేశారు. గురుకుల పాఠశాలలో మూడు పేఫోన్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా విద్యార్థినులు వారి తల్లిదండ్రులతో మాట్లాడుకునే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ అఖిల తెలిపారు. ఈ ఫోన్లు వినియోగించుకునేందుకు విద్యార్థినులకు ప్రభుత్వం ఏటీఎం కార్డుల తరహాలో స్మార్ట్‌కార్డులు అందజేసిందన్నారు. నిమిషానికి రూపాయి ఖర్చవుతుందని, ఈ కార్డును రీచార్జి చేయాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు సూచించిన నాలుగు ఫోన్ నంబర్లకు మాత్రమే విద్యార్థినులు ఫోన్ చేసే అవకాశం కల్పించినట్టు ప్రిన్సిపాల్ అఖిల తెలిపారు.

పేరు గొప్ప.. ఆఫీసు దిబ్బ

- కాగితాలకే పరిమితమైన 'స్వచ్ఛత'
- కార్యాలయాల ముంగిటే బురదగుంతలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రాజానగరం: పేరుకే నియోజకవర్గ కేంద్రం రాజానగరం. అభివృద్ధి మాత్రం ఆమడ దూరం. ఆక్రమణలకు అడ్డాగా మారిన ఈ ప్రాంతంలో 'స్వచ్ఛత'పై మాట్లాడేవారే కానీ.. ఆచరణలో శ్రద్ధ చూపేవారే కానరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిసరాల పరిశుభ్రత కోసం అధిక ప్రాధాన్యమిస్తూ అమలు చేస్తున్న 'స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాలు కాగితాల్లోనే కానీ ఆచరణలో కనిపించవు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తూతూమంత్రంగా కార్యక్రమాలు నిర్వహించి, ఫొటోలకు ఫోజులిచ్చి మిన్నుకుంటారు. అందుకే ఈ ప్రాంతంలో రోడ్ల పైనే కాదు.. ప్రభుత్వ కార్యాలయాల ముంగిట కూడా 'మురికి' రాజ్యమేలుతోంది.

ఒకే ప్రాంగణంలో ఉన్నా..

ఏ నియోజకవర్గ కేంద్రంలోనూ లేని విధంగా రాజానగరంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉంటాయి. వివిధ సమస్యలపై అధికారులను కలుసుకునేందుకు వచ్చే ప్రజలకు కొంతవరకు వెసులుబాటుగా ఉంటుంది కానీ, వేచి ఉండాలంటే చిరాకు వచ్చేలా పరిసరాలు ఉంటున్నాయి. కనీసం కూర్చునేందుకు ఒక్క కార్యాలయం వద్ద బల్లలు ఉండవు. కార్యాలయాల్లో అధికారులకు తగ్గట్టుగా హంగూ ఆర్భాటాలకు కొదువ లేదు కానీ, వారిని కలుసుకునేందుకు వచ్చే ప్రజలు వేచి ఉండేందుకు మాత్రం సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. పనికి రాని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా ఇక్కడి ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు దర్శనమిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే .. ఇక్కడ పరిసరాల పరిశుభ్రతను పూర్తిగా గాలికొదిలేశారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద మురికికూపంగా మారిన ప్రాంగణం



అధ్వానంగా మండల వ్యవసాయ శాఖ కార్యాలయ మార్గం

బురదగుంతలే నయం

ఆర్థికపరమైన కార్యకలాపాలకు నిలయంగా ఉండే తహసీల్దారు కార్యాలయ ప్రాంగణం కూడా ఈ విషయంలో ఏమాత్రం తీసిపోదన్నట్టుగానే ఉంది. కార్యాలయ ఖాళీ ప్రాంగణం బురదగుంతగా మారింది. ఇతరుల సామాజిక అవసరాలకు నిలయంగా మారినప్పటికీ, తహసీల్దారు కానీ, ఇతర రెవెన్యూ ఉద్యోగులకు కానీ పట్టడం లేదు. అసలు ఆ ప్రాంతంతో తమకు సంబంధం లేదన్నట్టుగానే చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ కార్యాలయాన్ని చేర్చి ఉన్న కాలేజీ విద్యార్థుల హాస్టల్ నుంచి వాడకం నీరు ఈ ఖాళీ ప్రాంగణంలోకి ప్రవేశించి, మురికికూపంగా మారింది. దీనికితోడు సమీపంలో నివసిస్తున్న వారు తమ పాడి పశువులను ఇక్కడే కట్టేయడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. భారీ గోతులు పడి, నీరు నిలిచిపోయి మురికివాడగా మారింది. కనీసం లారీ మట్టి వేసి, ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా చేయాలనే ఆలోచన ఇక్కడి రెవెన్యూ అధికారులకు రాకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తలచుకుంటే అధ్వానంగా ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ఏమంత కష్టం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.

వ్యవసాయ కార్యాలయం వద్ద

మండల వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తున్నా, ఆ బురదలోనుంచే కార్యాలయంలోకి అధికారులు, సిబ్బంది రాకపోకలు సాగిస్తున్నారు. దానిని ప్రక్షాళన చేసే చర్యలు తీసుకోవడం లేదు. అలాగే మండల ప్రజాపరిషత్, గ్రామ పంచాయతీ, సబ్‌స్టేషన్, గృహ నిర్మాణ శాఖ, ఐసీడీఎస్, మండల మహిళా సమాఖ్య, ఎన్ఆర్‌ఈజీఎస్ కార్యాలయాల చుట్టూ పిచ్చి మొక్కలు విపరీతంగా మొలిచి, పురుగులు, విష కీటకాలకు నిలయంగా మారినా ఎటువంటి చర్యలూ లేవు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పరిసరాల పరిశుభ్రతను చేపట్టే అవకాశం ఉన్నా.. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండవు

రాజానగరంలో ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా అపరిశుభ్రతతోనే దర్శనమిస్తున్నాయి. ఎక్కడా పరిసరాలు పరిశుభ్రంగా లేవు. ఉద్యోగులు కూడా వచ్చామా, వెళ్లామా అన్నట్టుగానే రోజు వారీ కార్యకలాపాలు చేసుకుంటున్నారు. ఈ కారణంగానే పరిసరాల పరిశుభ్రత ఎవరికీ పట్టకుండా పోయింది. గ్రామంలో మేజర్ డ్రైన్ల ప్రక్షాళన కూడా చేయడం లేదు. దీంతో దోమల ఉధృతి బాగా పెరిగిపోయింది.

– ఆలపాటి కుటుంబరావు, రైతు, రాజానగరం

ప్రాంగణాన్ని బాగు చేయించవచ్చు

మండలంలో నిత్యం వందలాది లారీల్లో మట్టి అక్రమ రవాణా జరుగుతోంది. ఆ విషయం సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలియనిది కాదు. కనీసం ఒకటి, రెండు లారీల మట్టిని తమ ప్రాంగణంలో వేయించి, బురదతో గోతులు పడిన ప్రాంగణాన్ని బాగు చేయించవచ్చు. కానీ అలా చేస్తే ఎక్కడ ఇబ్బంది వస్తుందోనని, మనకెందుకులే అన్నట్టుగా పరిసరాలను గాలికొదిలేసి, తమ పనులు చేసుకుపోతున్నారు.

– మిరియాల కృష్ణతేజ్, నిరుద్యోగి, వెలుగుబంద

సాంకేతిక పద్ధతులతో నేరాల నియంత్రణ

నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

కోరుకొండ: నేర నియంత్రణలో సాంకేతిక విధానాలను అనుసరించాలని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆదివారం ఆయన కోరుకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. పల్లెల్లో ఘర్షణలు, వివాదాలకు ప్రేరేపించే వారిపై, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని ఆదేశించారు. విస్తృతంగా నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, చోరీలు, ఘర్షణలకు చెక్ పెట్టాలన్నారు. ఆయా కేసులకు సకాలంలో చార్జిషీట్లు వేయాలన్నారు. తొలుత స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. స్టేషన్‌లో సిబ్బంది తక్కువగా ఉండటంతో నేరాలను ఛేదించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు ఈ సందర్భంగా పలువురు పోలీసులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని ఎస్పీకి విన్నవిస్తానని ఆయన తెలిపారు. డీఎస్పీ వెంట సీఐ సత్యకిశోర్, ఎస్సై నాగార్జున ఉన్నారు.

వర్షాలతో మెట్ట పైర్లకు జీవం



ఈలకొలనులో సాగు చేస్తున్న మొక్కజొన్న



రంగంపేటలో సాగవుతున్న బెండ తోట

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో రెండు రోజులుగా మోస్తరు వర్షం కురుస్తోంది. పంటలకు నీటి తడుల కోసం ఎదురు చూస్తున్న మెట్ట ప్రాంత రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. మండలంలో వరి, మిరప, పెసర, మినుము, మొక్కజొన్నతో పాటు, వివిధ రకాల కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. ఈ వర్షంతో మెట్ట పంటలు ప్రాణం పోసుకున్నాయి. ఉద్యాన పంటలకు కూడా ఈ వర్షం మేలు చేకూర్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో పంటలకు ఈ వర్షం చాలదని, ఇంకా అధిక శాతం వర్షపాతం నమోదు కావాలని నిపుణులు అంటున్నారు. అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టామని, వర్షంపైనే ఆశలన్నీ పెట్టుకున్నామని రైతులు చెబుతున్నారు.

వ్యక్తి అదృశ్యం



కందివలస వెంకటరమణ (ఫైల్)

బిక్కవోలు: అనారోగ్యంగా ఉన్న భార్య కోసం డబ్బు తెస్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఇది. ఊలపల్లి గ్రామానికి చెందిన తాపీ కార్మికుడు కందివలస వెంకటరమణ అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తన భార్యకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో డబ్బు తీసుకొస్తానని ఈ నెల 19న ఉదయం వెంకటరమణ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి అతడు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య కందివలస నాగజ్యోతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ ఇవ్వలేదని ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణం

సీతానగరం: సెల్‌ఫోన్ ఇవ్వడానికి తల్లి నిరాకరించిందన్న నెపంతో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గడ్డి మందు తాగిన వంగలపూడికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సుంకవల్లి నరేంద్రకుమార్ (20) రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. హెచ్‌సీ రేలంగి శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో నరేంద్రకుమార్ బీటెక్ చదువుతున్నాడు. సెల్‌ఫోన్ ఇవ్వడానికి తల్లి నిరాకరించడంతో శనివారం సాయంత్రం నరేంద్రకుమార్ మనస్తాపం చెందాడు. పొలం కోసం తెచ్చిన గడ్డి మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడినికుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతు ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. అతడి తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

కంబాలచెరువు: రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు, ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఆదివారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. కాట్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి బంగారురాజు, రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ దేవలంక బూరయ్య, రిటైర్డ్ డైరెక్టర్ కోటిపల్లి సత్యనారాయణ, కాపు నాయకులు దేశిరెడ్డి బలరాం నాయుడు, కాట్వా రిటైర్డ్ వింగ్ చైర్మన్ చేబ్రోలు వెంకటచలం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగిన రామారావు, కాప్రాక్స్ జిల్లా అడ్మిన్ పడాల చక్రినాయుడు, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కోల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రమణరావు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు విస్తృత సన్నాహాలు

- ఉత్సవాలకు మండపాల ముస్తాబు
- నేటి నుంచి అమ్మవారి పూజలు ప్రారంభం

బిక్కవోలు: శరన్నవరాత్ర వేడుకలకు గ్రామాలు సిద్ధమవుతున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన భారీ ఉత్సవాలు ఇప్పుడు పల్లెల్లోనూ ఉత్సాహంగా చేపడుతున్నారు. ఈ ఏడాది పదకొండు రోజులు ఉండడంతో ఆలయాల వద్ద ఆయా కమిటీలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో విస్తృత సన్నాహాలు జరుగుతున్నాయి. కనకదుర్గమ్మ ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో అమ్మవారిని నిలిపేందుకు పందిళ్లు వేస్తున్నారు. సోమవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

సిద్ధమవుతున్న చలువ పందిళ్లు

బిక్కవోలు మండలంలో ఊరూరా ఉత్సవ కమిటీలు ఇప్పటికే రాట ముహూర్తాలను నిర్వహించాయి. మండలంలో బిక్కవోలు, బలభద్రపురం, తొస్సిపూడి, కొమరిపాలెం, పందలపాక, కొంకుదురు, ఊలపల్లి, అనపర్తి మండలంలోని అనపర్తి, పెడపర్తి, కుతుకులూరు, రామవరం, కొప్పవరం, మహేంద్రవరం, రంగంపేట మండలంలోని రంగంపేట, వడిశలేరు.చంద్రేడు, దొంతమూరు.పెదపూడి మండలంలోని పెదపూడి, జి.మామిడాడ, పెద్దాడ, కరకుదురు, ఏపీ త్రయం, గండ్రేడు తదితర గ్రామాలలో ఘనంగా శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలోని ముఖ్య కూడళ్లలో ప్రత్యేక మంటపాలు ఏర్పాటు చేసి, దుర్గాదేవి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఆయా గ్రామాలకు తరలించారు.



కొమరిపాలెంలో కనకదుర్గమ్మ ఆలయం

చంద్రేడులో..

రంగంపేట: మండలంలోని చంద్రేడు గ్రామంలో వెలసిన శ్రీదేవి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబర్ రెండు వరకు శరన్నవరాత్ర ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు ఎం.కృష్ణ తెలిపారు. తొమ్మిది రోజులు అమ్మవారిని తొమ్మిది అలంకారాల్లో అమ్మవారిని దర్శించుకోవచ్చని చెప్పారు. సోమవారం అమ్మవారికి చీర, పసుపు కుంకుమలతో సారెను లాంఛనంగా అమ్మవారికి సమర్పిస్తారన్నారు. శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం పరమేశ్వరి అలంకారం, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణ, 25న అష్టకాళీ, 26న శ్రీమహాలక్ష్మి, 27న బాలత్రిపుర సుందరి, 28న చండీ, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, ఒకటిన రాజరాజేశ్వరి, 2న మహిషాసుర మర్దిని అలంకారాలతో అమ్మవారు దర్శనమిస్తారని తెలిపారు.



నవరాత్రులకు సిద్ధమైన అమ్మవారు



చంద్రేడులో శ్రీదేవి కనకదుర్గమ్మ

పూజా సామగ్రికి రెక్కలొచ్చాయి

రాజానగరం: శరన్నవరాత్ర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు జగన్మాతను వివిధ అలంకారాల్లో పూజిస్తారు. ఈ క్రమంలో ఆయా పూజలకు అవసరమైన సామగ్రికి మార్కెట్లో రెక్కలొచ్చాయంటున్నారు కొనుగోలుదారులు. ఆలయాల్లోనే కాకుండా చాలామంది ఇళ్లలో నిత్య పూజలు జరుగుతుంటాయి. ఇందుకు అవసరమైన పూలు, పండ్లు, ముఖ్యంగా కొబ్బరికాయలకు ఆదివారం స్థానిక మార్కెట్‌లో విపరీతమైన ధరలు పలికాయి. కలువ పువ్వు రూ.10, తామర పువ్వు రూ.20, పది చామంతి పూలు రూ.30 పలుకుతుంటే, కొబ్బరికాయ ఒక్కటి రూ.40కు పైబడి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో రేట్లు బాగా పెరిగాయని, కొబ్బరికాయలైతే అసలు దొరకడం లేదని వ్యాపారులు అంటున్నారు. వినాయక చవితికి కూడా ఇలాగే పూజా సామగ్రిని అధిక ధరలకు విక్రయించారు.



రాజానగరంలో పూలు, పండ్ల దుకాణం వద్ద కొనుగోలుదారుల సందడి

ఇసుకతో ప్రమాదాల రిస్కు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డుపై పడి ఉన్న ఇసుకతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాజమహేంద్రవరం-సీతానగరం నాలుగు లేన్ల రోడ్డులో నిత్యం ఇసుక లారీలు ప్రయాణిస్తున్నాయి. రఘుదేవపురం, మునికూడలి, కాటవరం ర్యాంపు నుంచి లారీలపై ఇసుక రవాణా అవుతోంది. ఈ క్రమంలో రాజమహేంద్రవరం-సీతానగరం రోడ్డుపై మునికూడలి నుంచి కాటవరం గ్రామాల్లో లారీల నుంచి ఇసుక పడటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలు నడిపినా ప్రమాదం ఖాయమనేలా రోడ్డు తయారైంది. నాలుగు లేన్ల రోడ్డులో సగభాగం ఇసుక పేరుకుపోవటంతో వాహనదారులు జారిపడుతున్నారు. రోడ్డుపై పడిన ఇసుకను ర్యాంపుల నిర్వాహకులే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



మునికూడలిలో రోడ్డుపై జారి పడిన ఇసుక

సమాజ చైతన్యానికి గురజాడ కృషి

కడియం: ప్రముఖ సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు సమాజ చైతన్యానికి ఎనలేని కృషి చేశారని జనవిజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం రాష్ట్ర కో-కన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. గురజాడ జయంతిని పురస్కరించుకుని కడియంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిలుకూరి మాట్లాడుతూ, ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్ వంటి విదేశీ భాషల్లో సైతం గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం అనువాదమయ్యాయంటే ఆయన గొప్పదనం అవగతమవుతుందన్నారు. స్థానిక గిరజాల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి స్వామిప్రసాద్, కడియం నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు తదితరులు గురజాడ గొప్పతనాన్ని వివరించారు. అంతకు ముందు గురజాడ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక, చెల్లపిళ్ల వేంకటశాస్త్రి కళా సేవా సమితి, అరసం సంఘాల ప్రముఖులు ఉంగరాల వీరభద్రరావు, తమ్మిశెట్టి ప్రసాద్, ఆకుల వీర్రాజు, బోణం సత్యనారాయణ, బొర్రా రామకృష్ణ, ఆకుల సూర్యనారాయణ, కె.రవిబాబు, చిక్కాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రముఖులు